ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7 । కనిష్ఠం 16.9



నిర్మల్

జిల్లా వార్తలు

8

ఆదివారం 16 ఫిబ్రవరి 2025



అజోల మొక్కలను పశువులకు దాణాగా పెడుతున్న రైతు

నీటి తొట్టి నుంచి అజోల మొక్కలను సేకరిస్తున్న డీఆర్డీవో



జిల్లాలో అరుదైన మొక్కల పెంపకం



పెరుగుతున్న ఫ్యాషన్ ఫ్రూట్ ఇదే..

- ఈ ఏడాది కొత్త కొత్త రకాల మొక్కలను జిల్లాకు పరిచయం చేస్తున్న ఈజీఎస్
- సరికొత్త ఫ్యాషన్ పండ్ల మొక్కల పెంపకం
- ఇదివరకే హోమ్ ప్లాంట్స్‌లో డ్రాగన్ మొక్కల పంపిణీ
- ఆశాజనకంగా పెరుగుతున్న అరుదైన పొనికి మొక్కలు
- కొయ్య బొమ్మల తయారీలో పొనికి పాత్ర కీలకం
- పశువుల దాణా కోసం 'అజోల'
- వినూత్న ప్రయోగాలతో విజయం వైపు ఎన్ఆర్ఈజీఎస్

ఖానాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వినూత్న ప్రయోగాలతో సరికొత్త ఆలోచనలు చేస్తూ జిల్లాను ఔషధమొక్కల గనిగా మార్చే దిశగా గ్రామీణ అభివృద్ధి శాఖ అడుగులు వేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇన్నాళ్లు అన్ని ప్రాంతాల్లో జరిగే పనుల మాదిరిగానే జిల్లాలోను పనులు చేపట్టిన అధికారులు ఇకపై ఆ మూసా విధానానికి స్వస్తి చెప్పినట్లే కనిపిస్తోంది. జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడి నేల స్వభావాన్ని బట్టి ఏ విధమైన మొక్కల పెంపకాన్ని చేపడితే వాటిని భావితరాలకు ఇతర ప్రాంతాలకు ఆదర్శప్రాయంగా అందించవచ్చుననే ఆలోచనతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుని గత కొంత కాలంగా ఎన్ఆర్ఈజీఎస్ జిల్లాలో వినూత్న పద్ధతులను అనుసరిస్తోంది. అందులో భాగంగా గత ఏడాది పలుచోట్ల నర్సరీల్లో పైనాపిల్ లాంటి మొక్కల పెంపకాలను చేపట్టిన గ్రామీణ అభివృద్ధి శాఖ తాజాగా జిల్లాకు ఓ అరుదైన మొక్కను పరిచయం చేసింది. ఈ ఏడాది జిల్లాలో నాలుగు ప్రాంతాల్లోని నర్సరీలలో ఈ అరుదైన జాతికి చెందిన ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కను పెంచుతున్నారు. ఇదివరకే జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్స్ లాంటి అరుదైన పండ్ల మొక్కలను హోమ్ ప్లాంట్స్‌లో భాగంగా పంపిణీ చేశారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అలంకరణ మొక్కలకు స్వస్తి పలికి ఔషధ మొక్కల పెంపకాలను హోమ్ ప్లాం ట్స్‌లో విరివిగా ఉపయోగించాలని నిర్ణయించారు. ఇలా జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వినూత్న ప్రయోగాలు చేస్తూ విజయం వైపు దూసుకెళ్తున్న గ్రామీణ అభివృద్ధి శాఖను పలువురు అభినంది స్తున్నారు.



మామడలో ఆశాజనకంగా పెరుగుతున్న కొయ్యు బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి మొక్కలు

జిల్లాకు ఈ ఏడాది సరికొత్త 'ఫ్యాషన్'

అనుకరణ లాంటి మూసా విధానానికి స్వస్తి చెప్పి మొక్కల పెంపకంలో జిల్లాలో గ్రామీణ అభివృద్ధి శాఖ చేస్తున్న ప్రయోగాత్మక ఆలోచన నుంచి ఈ ఏడాది జిల్లా సరికొత్త 'ఫ్యాషన్'ను సంతరించుకుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణ మొక్కల పెంపకాలను ఓవైపు కొనసాగిస్తూనే మరోవైపు జిల్లాకు ఔషధ గుణాలు పుష్కలంగా కలిగి ఉన్న ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కను పరిచయం చేసేందుకు డీఆర్డీవో విజయలక్ష్మి కృషి చేస్తున్నారు. ఇందుకుగాను ఆన్‌లైన్ ద్వారా విత్తనాలను సేకరించిన విజయలక్ష్మి జిల్లాలోని కొండాపూర్‌లో గల సమీకృత వ్యవసాయక్షేత్రంలో ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కల పెంపకాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. గత ఏడాది నాటిన ఈ మొక్కలు సత్ఫలితాన్ని ఇచ్చి ఈ ఏడాది ఫలాలను కూడా ఇస్తుండడంతో ఈ మొక్కల పెంపకాన్ని మరింత పెంచేందుకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు నర్సరీలను ఎంపిక చేసుకున్నారు. జిల్లాలోని కొండాపూర్, కడ్తాల్, రత్నాపూర్ కాండ్లి, కడెం నర్సరీలలో ఫ్యాషన్‌ఫ్రూట్ మొక్కలను పెంచుతున్నారు. కొమ్మ కత్తిరింపు విధానంలో ఈ నర్సరీలలో 2000 మొక్కలను ఈ ఏడాది పెంపొందిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఫ్యాషన్‌ఫ్రూట్‌లో పుష్కలమైన ఔషధ విలువలు కలిగి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా పండ్ల కంటే గణనీయంగా సి విటమిన్ కలిగి ఉన్న ఫ్యాషన్‌ఫ్రూట్ తినడం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ప్రమాదకరమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు సైతం దరిచేరవని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఈ మొక్కలను విజయవంతంగా నాటి వచ్చే సంవత్సరం నుంచి మరింత విరివిగా వీటిని పెంపొందించాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

హోమ్ ప్లాంట్స్‌లో ఇక ఔషధ మొక్కల పెంపకం

గతంలో నివాస సముదాయాల్లో పెంచే మొక్కల్లో పూలమొక్కలకు ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో ఈ ఏడాది అలంకరణ మొక్కలకు ఇక స్వస్తి చెప్పబోతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలతో అలంకరణ మొక్కల స్థానంలో పుష్కలమైన ఔషధ గుణాలు కలిగిన కలబంద , అశ్వగంధ, కరివేపాకు, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కలను నాటనున్నట్లు ఉపాధి హామీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందుకుగాను ఇదివరకే నర్సరీల్లో ఔషధ మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తూ రానున్న వనమహోత్సవంలో నివాస సముదాయాలను ఇక ఔషధ మొక్కలకు నిలయంగా తీర్చిదిద్దాలని జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

కొయ్యు బొమ్మల ముడిసరుకు 'పొనికి' పెంపకం

కొయ్యు బొమ్మలకు పెట్టింది పేరైన జిల్లాకు ఇన్నాళ్లు ఆ బొమ్మల తయారీకి ఉపయోగించే ముడిసరుకైన పొనికి మొక్కల పెంపకం అనేది కలగానే మిగిలిపోయింది. కానీ ఈసారి ఆ కలను సహకారం చేసేందుకు తాము సంసిద్ధం అన్నట్లుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అధికార బృందం మొక్కవోని విశ్వాసంతో 'పొనికి' మొక్కల పెంపకాన్ని ప్రారంభించింది. జిల్లాలో 9 ఎకరాల్లో పొనికి మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. కాగా మహబూబాఘాట్ ప్రాంతంలో పెంచుతున్న పొనికి మొక్కలను కోతులు ధ్వంసం చేసినప్పటికీ మామడ మండలంలోని మామడ, జగదాంబ తాండ, లింగాపూర్ ప్రాంతాల్లో చేపడుతున్న పొనికి మొక్కల పెంపకం ఆశాజనకంగా సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఐదు వేల పొనికి మొక్కలను పెంపొందిస్తున్న నేపథ్యంలో ఈ ప్రయోగం విజయవంతం అయితే వచ్చే ఏడాది ఆ విస్తీర్ణాన్ని మరింత పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఓవైపు కొండపల్లి కొయ్యు బొమ్మలు, మరోవైపు నిర్మల్ కొయ్యు బొమ్మలు అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన నేపథ్యంలో నిర్మల్‌లో తయారయ్యే కొయ్యు బొమ్మలకు ఉపయోగించే పొనికి కర్ర జిల్లాలో అందుబాటులోకి వస్తే ఈ పరిశ్రమకు మరింత మంచి జరుగుతుందని చెబుతున్నారు.

పశువుల దాణాపై ప్రత్యేక దృష్టి

ఉపాధి హామీ పథకం ద్వారా పాడి రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు పశువుల దాణాపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించారు. ఇందుకుగాను అజోల అనే మొక్కలను వృద్ధి చేస్తున్నారు. నీటి తొట్టిలలో పెరిగే ఈ మొక్క పశువులతో పాటు కోళ్ల పెంపకంలో సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇందుకుగాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుకు నీటి తొట్టిల నిర్మాణానికి రూ. 18 వేలను సైతం మంజూరు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ప్రయోగాత్మకంగా మండలానికి ఒకటి చొప్పున 18 అజోల మొక్కల పెంపకం తొట్టిలను నిర్వహిస్తున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. రైతులు ముందుకు వచ్చి ఈ దానా తొట్టిల నిర్మాణానికి సిద్ధమైతే ఎంతమందికైనా ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరు చేస్తామని చెబుతున్నారు.

అరుదైన మొక్కల పెంపకంలో విజయవంతం అవుతాం

విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్



జిల్లాలో ఈ ఏడాది ఫ్యాషన్‌ఫ్రూట్, డ్రాగన్‌ఫ్రూట్ లాంటి అరుదైన మొక్కల పెంపకం చేపడు తున్నాం. కొయ్యు బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి మొక్కలు సైతం ఆశాజనకంగా పెరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధతో నివాస సముదాయాలలో ఔషధమొక్కల పెంపకంపై దృష్టి సారించాం. కలబంద, రణపాల, అశ్వగంధతో పాటు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు లాంటి మొక్కల పెంపకాన్ని సైతం ఈ ఏడాది ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. ఈ అరుదైన మొక్కల పెంపకంలో అందరి భాగస్వామ్యం ఉంటే కచ్చితంగా విజయవంతం అవుతాం.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలని వారి సేవలు మరువలేనివని ఎంఈవో కస్తూరి శంకర్ పేర్కొన్నారు. ఇటీవల రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుడు కరిపే ప్రసాద్‌ను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంఈవో శంకర్ మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ పదవీ కాలంలో వందలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. భావి భారత నిర్మాతలు ఉపాధ్యాయులేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బిట్లింగ్ నవీన్, అయ్యప్ప గురుస్వామి, సాయి సేవా సంఘం బాధ్యుడు జిందం గోవర్ధన్, బంగల్‌పేట్ యువజన సంఘం అధ్యక్షుడు పెండెం శ్రీను, సంఘ బాధ్యుడు కరిపే అజయ్, తదితరులు పాల్గొన్నారు.

20న హైదరాబాద్ తరలిరండి



రంగాపేట్‌లో గోడ ప్రతులను విడుదల చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల హామీని వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20వ తేదీన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఖానాపూర్ మండలంలోని రంగపేట్, కొత్తగూడెంలో గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చే ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనెస్వామి, గూట్ల ప్రసాద్, రాజేష్, శ్రీనివాస్, గంగన్న, తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుంటాల, ఫిబ్రవరి, 15 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుంటాలతో పాటు సూర్యాపూర్ గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను శనివారం ముథోల్ ఎమ్మెల్యే రామరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, నాయకులు రమణ రావు, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

పోలీసుస్టేషన్‌లకు అధునాతన కంప్యూటర్లు

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లలో మెరుగైన సేవలు అందించేందుకు నూతన సాంకేతికతతో కూడిన కంప్యూటర్లు, వెబ్ కెమెరాలు, ప్రింటర్లను పంపిణీ చేసినట్టు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వాటిని పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో పెరిగిన అధికకేసుల కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సమస్యలు అధిగమించేందుకు నూతన పరికరాలు దోహదం చేస్తాయన్నారు. కోర్టు కేసుల వివరాలు సంబంధిత అధికారులకు అందజేసేందుకు ఉపయోగపడతాయన్నారు. వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు వెబ్ కెమెరాలు సహాయ పడతాయన్నారు. అదనపు ఎస్పీ అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఉపేందర్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

ఏడాది కాలంలో

రూ. 400 కోట్ల నిధులతో ఖానాపూర్ అభివృద్ధి చేశాం

- ఇచ్చిన హామీ ప్రకారం రూ. రెండు లక్షల రుణమాఫీ చేశాం
- నేను సెక్యులర్ వాదిని.. ఏ మతానికి వ్యతిరేకం కాదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఏడాదికాలంలో రూ.400ల కోట్ల నిధులతో ఖానాపూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ ప్రాంతంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా సైతం ఇదివరకే మూడు ఎకరాల వరకు వ్యవసాయ భూమి గల రైతుల ఖాతాలలో పెట్టుబడి సాయం డబ్బులు జమ అయ్యాయన్నారు. రాష్ట్రంలో రూ. రెండు లక్షల రుణమాఫీని నూటికి నూరు శాతం పూర్తి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా 2 లక్షల పైన ఉన్న రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పలేదన్నారు. ఈ విషయంలో ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే ఖానాపూర్ ప్రాంతంలో కొంతమంది మతపరమైన చిచ్చులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా తన సొంత తమ్ముడు పని చేసిన తాను క్షమించబోనని బొజ్జు స్పష్టం చేశారు. ఆదివాసి ఎమ్మెల్యేనని ఏదో బెదిరిస్తే భయపడతాననుకోవడం కొంతమంది అవివేకానికి అద్దం పడుతోందన్నారు. తాను అన్ని చూసిన అనుబాంబులాంటోందని ఇటువంటి తాటాకు చప్పుల్లకు బెదరబోనని ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. నేను సెక్యులర్ వాదినని ఏ మతానికి అనుకూలంగా కానీ వ్యతిరేకంగా కానీ ఉండనన్నారు. తనకు అన్ని మతాలు అన్ని కులాలు సమానమని స్పష్టం చేశారు. తనను ముస్లిం వ్యతిరేకిగా కొంతమంది సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలే తిప్పికొడతారన్నారు. రానున్న ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు జరిగిన కార్యకర్తల సమావేశంలో రానున్న ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ పెంబి మండల అధ్యక్షులు స్వప్నిల్ రెడ్డి, ఖానాపూర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, శనివారపు కమలాకర్, సహా నాలుగు మండలాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మరింత బాధ్యతగా పని చేస్తాం'

తమ పదవి కాలాన్ని పొడగించడంతో మరింత బాధ్యతగా పని చేస్తామని సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డిలు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆరు నెలల పాటు పీఏసీఎస్ చైర్మన్ల పదవి కాలాన్ని పెంపొందించిన నేపథ్యంలో శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును పీఏసీఎస్ చైర్మన్‌లు ఇద్దరు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. తమకు మరో ఆరు నెలల పాటు ప్రజా సేవ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిన నేపథ్యంలో తాము మరింత బాధ్యతాయుతంగా పని చేస్తామని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో పేర్కొన్నారు.

దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్

భైంసారూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుచుంద్ గ్రామంలో శనివారం దివ్యాంగ్ శక్తి నూతన భవనాన్ని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన భవనానికి సహకరించిన దాతలను అభినందించారు. సమాజంలో దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ ప్రతిఫలం ఆశించకుండా సేవా గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పల్లె ప్రకృతి వనం పరిశీలించి, కార్యదర్శి శ్రీధర్‌కు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజాం హుస్సేన్, ఫౌండేషన్, చైర్మన్ మహేష్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్, ప్రసంగిస్తున్న దృశ్యం

నేడు బాసరలో

సేవాలాల్ మహరాజ్ జయంతోత్సవం

- భారీగా ఏర్పాట్లు
- హాజరుకానున్న మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు



జయంతి మహోత్సవం సందర్భంగా బాసరలో చేసిన ఏర్పాట్లు

బాసర, ఫిబ్రవరి, 15 : (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరలో సంత్ సేవాలాల్ మహరాజ్ 286 జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయం నుండి గోదావరికి వెళ్లే రహదారి పక్కన 20 వేల మంది సరిపోయే విధంగా ఏర్పాట్లు చేశారు. షామియానాలు ఏర్పాటు చేశారు. బంజారా ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వివిధ పార్టీల్లో ఉన్నత స్థాయిలో బంజారా ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 20 వేలకు పైగా ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఎలాంటి లోపాలు లేకుండా ముందుగా భద్రతా చర్యలను ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ పరిశీలించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



కుభీర్‌లో సేవాలాల్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కుభీర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని గిరిజన తండాల్లో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సంత్‌శ్రీ సేవలాల్ మహరాజ్ 286వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు దేవా, దేవ్‌రావు, సాప పండరి, చౌహాన్ విశ్వనాథ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యం కేసునమోదైంది. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన షేక్ సాజిద్(32) అనేవ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లలో ఆచూకీ కోసం వెతికిన తెలియలేదు. సోదరుడు షేక్ ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇసాక్ అలీ తెలిపారు.

'స్వార్థ ప్రయోజనాల కోసం జాతిని తాకట్టు పెట్టొద్దు'

ఉట్నూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం జాతిని తాకట్టు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది మంచిది కాదని నేతకాని మహార్ రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి గంగేశ్‌లు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మమ్ములను అక్కున చేర్చుకున్న నాయకులు ఎవరు లేరని, ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు 2011లో జరిగిన కులగలను ఆధారితంగా వర్గీకరణను ఏర్పాటు చేయడం సరైనదని కాదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2024లో జరిగినజనగణను ఆధారితంగా ఎస్సీలో ఉన్న 59కులాల జనాభా ఎంత అనేది ప్రభుత్వం దగ్గర ఉందని, దాని ఆధారంగా ఎవరి కుల జనాభా నిష్పత్తి ప్రకారం వారికి సరైన వాటా ఇచ్చి వర్గీకరణకు చట్టబద్ధం కల్పించాలన్నారు. తమకు 4 శాతం నిష్పత్తి ఇవ్వాలన్నారు.

'తప్పుడు పత్రాలతో ఇచ్చోడలో కుటుంబపాలన'



సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సంఘం నాయకులు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ కుల ధ్రువీకరణ పత్రంతో చౌహాన్ దేవానంద్ అక్రమాలకు పాల్పడుతున్నాడని బోథ్ నియోజకవర్గ బంజారా సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలలో భాగంగా బోథ్ నియోజకవర్గ బంజారా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తప్పుడు పత్రాలతో ఇచ్చోడలో కుటుంబం పాలన సాగిస్తుందని, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడకు బతుకుదెరువు కోసం వచ్చినటువంటి బెల్దార్ కులానికి చెందిన దేవానంద్ తప్పుడు కుల పత్రంతో (ఎస్టీ)గా పదవులు అనుభవిస్తున్నారని తప్పుడు పత్రాలను రద్దు చేయాలని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బంజారా సంఘం అధ్యక్షుడు ధారావత్ నరేందర్, ఉపాధ్యక్షులు చౌహాన్ సాయిరాం, రాథోడ్ అజయ్, బానుసింగ్, ప్రధాన కార్యదర్శిగా వినంత్‌రావ్, రాథోడ్ అనిల్, వినోద్ పాల్గొన్నారు.

పెరుగుతున్న వ్యాధుల తీవ్రత

తాంసి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాధుల తీవ్రత రోజు రోజుకి పెరుగుతుంది. మండలంలోని చాలా గ్రామాల్లో రోగులు మంచం పట్టారు. నాలుగు రోజుల నుంచి దినములో ఎండ, చీకటి పడిందంటే చలి ఉండడంతో జనం మంచం పడుతున్నారు. ముఖ్యంగా కీళ్లు, కాళ్ల నొప్పులతో పాటు వాంతులు విరోచనాలు చేసుకుంటున్నారు. గతంలో గిరిగావ్ గ్రామంలో ఒకరు డెంగీతో మంచం పట్టారు. చాలా మంది గొంతు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. సిబ్బంది స్థానికంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కులసంఘ పెద్దలు

ఉట్నూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ జయంతిని ఉట్నూర్ ఏజెన్సీలోని ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఉట్నూర్ పట్టణంలోని సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో చేరి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బోగ్‌బండార కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం సేవాలాల్ మహారాజ్ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్‌రితేష్ ఆధ్వర్యంలో భక్తులు మహారాజ్‌కు పూజలు నిర్వహించారు. ఊరేగింపు ద్వారా పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ప్రధాన వీధుల గుండా అంబేద్కర్‌చౌక్ మీదుగాపెట్రోల్‌బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ జెండా గద్దె వద్దకు నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు సైతం తమ సాంస్కృతి సాంప్రదాయాలతో నృత్యాలు చేశారు. జీసీసీ పెట్రోల్‌బంకు వద్ద ఉన్న సేవాలాల్ జెండా వద్ద బోగ్‌బండార నిర్వహించారు. బంజార ధర్మ ప్రచార ఆడే ప్రేమ్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, కన్వీనర్‌రాథోడ్‌భీమ్‌రావ్, భరత్‌చౌహాన్, జాదవ్‌సుమన్‌బాయ్, బానోత్ జగన్, జాదవ్‌చంద్రకాంత్, గడ్డం ప్రకాష్, రాథోడ్ గణేష్, రవీందర్, పవర్‌దేవిదాస్, బానోత్ రామారావు, రాజేశ్‌నాయక్, రాథోడ్‌అనిత, చౌహాన్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హస్నాపూర్, కొత్తగూడ, ఏందా, నడ్డంకూడా, జైత్రంతండా, శంకర్‌తండా తదితర గ్రామాలలో సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాలను ప్రజలు నిర్వహించుకున్నారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలో శనివారం శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనులందరూ ఆదర్శమూర్తి సంత్ సేవాలాల్ చూపిన బాటలో పయనించి మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సేవాలాల్ చేసిన సేవలను అనిర్వచనయమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

● జీసీడీవో మేస్రం చాయ



అవగాహన కల్పిస్తున్న జీసీడీవో మేస్రం చాయ

బజార్‌హత్నూర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి వ్యక్తి గత పరిశుభ్రతను పాటించినప్పుడే విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉంటారని జీసీడీవో మేస్రం చాయ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాడగూడా గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వసతి గృహంలోని వంట గది, విద్యార్థులు భోజనం చేసే పరిసర ప్రాంతాలు, టాయిలెట్స్ పరిసర ప్రాం తాలలో వెళ్ళి పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని అక్కడ పనిచేసే వారికి సూచించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో మాట్లా డుతూ ఇష్టపడి చదివినప్పుడే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవ చ్చన్నారు. పదోతరగతి పరీక్షల షెడ్యూల్ మార్చి 21 నుంచి ప్రారంభమ వుతుండగా విద్యార్థినులను ప్రతిరోజు వారికి స్టడీ అవర్‌లను నిర్వహిం చాలని, ఇప్పటివరకు నిర్వహించిన పరీక్ష పేపర్‌లను ఆమె పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మానసికంగా ఉల్లాసంగా ఉంటారని, దీని కోసం ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని వారికి సూచించారు. బజార్‌హత్నూర్ ఆరోగ్య సిబ్బందితో విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి వారికి సంబం ధించిన మందులను అందజేశారు.

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిలా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రాంజీగోండు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, 6 గ్యారంటీలతో పాటు, ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా హక్కుల పునరుద్ధరణ డిమాండ్‌తో సీపీఐఎంఎల్ న్యూడె మోక్రసీ పార్టీఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాలాసుభాష్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మేస్రం మారుతి, ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

'లక్ష్యం మరిచిన నాయకులను బహిష్కరిస్తున్నాం'

నేరడిగొండ, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.ఉద్యమ లక్ష్యానికి స్ఫూర్తికి విరుద్ధంగా స్వార్థపూరిత ఆలోచన వైఖరితో వ్యవహరించిన ఎమ్మా ర్పీఎస్ మండల అధ్యక్షులను శాశ్వతంగా ఉద్యమం నుంచి బహి ష్క రిస్తున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాల్సిందిగా గుర్తుచేస్తున్నామన్నారు. తదుపరి ఉద్యమ సీనియర్ నాయకుల సూచనతో అన్ని గ్రామ కమిటీల అధ్యక్షులతో నూతన ఎమ్మార్పీఎస్ నేరడిగొండ మండల కమిటీని త్వరలో ఎన్నుకుంటామని ఆయన ఈ ప్రకటనలో వివరించారు. జాతి లక్ష్యం ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా 30 ఏండ్లుగా సాగుతున్న మహో త్తరమైన ఉద్యమంలో అందరూ కలిసి రావాలన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

తలమడుగు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు తలమడుగు మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దేగామలో అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహసంబంధాలు మెరుగు పడుతాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంతేకాకుండా క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. గెలుపు ఓటములు సహజమే అయినప్పటికీ ప్రతిఒక్కరూ ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ.25 వేలను, ద్వితీయ బహుమతి రూ.15 వేలను త్రియంబక్ ఉపాధ్యాయుడు అందిస్తున్నాడన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఇందులో మాజీ ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు మాధవ్, వెంకన్న, గ్రామస్థులు లస్మన్న, రాజమల్లు తదితరులున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి



కారు ఢీ కొనడంతో ధ్వంసమైన ద్విచక్రవాహనం

బోథ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్‌రాష్ట్ర రహదారిపైన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన అరవింద్ కిషన్ జాదవ్ (32) అనే యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. శుక్రవారం కౌట, సాకెర గ్రామాల మధ్య కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొనడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం రావడంతో యువకుని మృతదేహాన్ని బోథ్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. శనివారం ఉదయం ఎస్సై ఈ రూట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పరిశీలనలో షిఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టినట్లు అనుమానిస్తున్నారు. ఉదయం పూట ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

యువకునిపై అడవి పంది దాడి..

సొనాల మండలకేంద్రానికి సమీపంలో పెట్రోల్‌బంకు నుంచి ఉదయం పూట ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో రోడ్డుపై వెళుతున్న యువకుడు విష్ణుపైన అడవి పంది దాడి చేసింది. దాడిలో యువకుడు తృటిలో తప్పించుకున్నాడు. రోడ్డుపై వెళ్తున్న యువకుడిని బ్రిడ్జి కింద నుండి వచ్చిన అడవి పంది ఒక్కసారిగ దాడి చేసింది. దీంతో యువకుడు కేకలు వేయడంతో పంది పారిపోయింది. బాధితుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సీ గ్రేడ్ పరీక్ష

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలోని డిగ్రీసైన్స్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు సీ గ్రేడ్ పరీ క్షను నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాడెట్లకు ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్ తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించారు. మొత్తం 161 మంది క్యాడెట్లు హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారు. ఈనెల 16న స్థానిక ఇందిరా ప్రియ దర్శిని స్టేడియంలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కల్నల్ మధుసూదన్ రావు, కెప్టెన్ జగ్రామ్, అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



ఉప ముఖ్యమంత్రితో నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు శనివారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలుసుకున్నారు. పొన్కల్ సదర్మాట్ బ్యారేజ్ నుంచి మామడ, దిమ్మదుర్తి, కప్పనపల్లి గ్రామాలు సాగునీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు భుజంగ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఏనుగు లింగారెడ్డి, రఫీ, బాపయ్య, ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక
సమావేశం విజయవంతం చేయాలి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం విజయవంతంచేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలోని కొండాపూర్ గ్రామంలో గల చంద్రశేఖర కన్వెన్షన్‌హాల్‌లో ఈ నెల 16న నిర్వహించే ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆదివారం జన్మదినాన్ని పురస్కరించుకుని శని వారం పట్టణంలోని దేవరకోట దేవస్థానంలో ప్రత్యేకపూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్ కొండా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, గండి రామన్న ఆలయ చైర్మన్ గంగోని భూరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలను తనిఖీ చేసిన డీఐఈవో



ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో

తానూర్ , ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలను శనివారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి(డీఐఈవో) జే. పరుశురాం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి వార్షిక పరీక్షలు, ప్రాక్టికల చేసిన తీరును సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతుందని, మాస్ కాపియింగ్‌కు తావివ్వరాదని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈయన వెంట ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్, డీఐఈవో సభ్యులున్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



ఎడ్‌బిడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భైంసా, ఫిబ్రవరి 15 : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో శనివారం శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ వేడుకల్లో పాల్గొని శ్రీ సంత్ సేవా లాల్ మహరాజ్ చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గిరిజనులు సంక్షేమానికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బాధ్యతాయుతతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజనులందరూ ఆదర్శమూర్తి సంత్ సేవాలాల్ చూపిన బాటలో పయనించి మార్గదర్శకులుగా ఎదగాలని అకాంక్షించారు. సేవాలాల్ చేసిన సేవలను అనిర్వచనయమైనవని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ సంత్ సేవాలాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. ఇందులో బంజార సంఘం ప్రతినిధులు నాజిమ్ సింగ్ నాయక్, జాదవ్ రాజేష్ బాబు, బలిరామ్, ఆత్మరామ్ రాథోడ్, మనోజ్ జాదవ్, ప్రకాష్ జాదవ్, మోతీరామ్ రాథోడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముథోల్ మండలంలో..

ముథోల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విట్టోలి తాండ, రాజు తాండ, చింతకుంట తాండ, తరోడా తాండ, ఎడ్‌బిడ్ తాండ, తదితర గ్రామాల్లో శనివారం బంజారాల ఆరాధ్య సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బంజారాల నాయకులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఎడ్‌బిడ్ తాండలో ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ... బంజారాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బంజారాల కుల పెద్దలు, తాండ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

దౌనెల్లి తాండాలో..

కుంటాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దౌనెల్లి తాండాలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా గ్రామస్తులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాల వేసి ప్రతి ఒక్కరు ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలని సూచిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



దౌనెల్లి తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతిలో పాల్గొన్న గ్రామస్థులు

ఆరోగ్య పట్టభద్రుల
సమస్యలు పరిష్కరించే వారికి మద్దతు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించే వారికి వచ్చే గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని వైద్య, ఆరోగ్య శాఖ జేఏసీ కన్వీనర్, ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ మోహన్ గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు వైద్యులు సహా పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా హోల్డర్లు వేలాది మంది ఉన్నారని వారి సంక్షేమంతో పాటు భవిష్యత్తులో వారికి అండగా ఉండే అభ్యర్థికి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని చెప్పారు. ఎంబీబీఎస్ ఆయుర్వేద, యునాని, హోమియో వంటి వైద్య డిగ్రీలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, ఎక్స్‌రే టెక్నీషియన్, బీఎస్సీ నర్సింగ్, జనరల్ నర్సింగ్, సహా వివిధ పారామెడికల్ డిప్లొమా హోల్డర్ల సమస్యలు అనేకం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తమ శాఖ సమస్యల పరిష్కారం కోసం పాటుపడే అభ్యర్థికి వచ్చే గ్రాడ్యుయేట్ శాసన మండలి ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలో వచ్చే ఎన్నికల్లో అనేక మంది వైద్య, ఆరోగ్య పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారని చెప్పారు. వైద్య, ఆరోగ్య పట్టభద్రుల సమస్యలను ఎవరు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. రానున్న శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో వైద్య, ఆరోగ్య పట్టభద్రులు సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్‌ల తుది జాబితా విడుదల



తుది జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో

ముథోల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ఎంపీడీవో శివ కుమార్ త్వరలో జరుగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ తుది జాబితాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నజీమ్, తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డయాగ్నొస్టిక్ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్ శనివారం జిల్లా వైద్యాధికారి కే. రాజేందర్ ఆవిష్కరించారు. సంఘ నాయకుల నేరెళ్ల హన్మంతు, సంతోష్ కుమార్, టి. వెంకట్ రావు, వకీల్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

'ప్రయాణికులు భద్రత పాటించండి'



మాట్లాడుతున్న ఆర్ఎం సలోమన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సమయంలో భద్రతలు పాటించాలని ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి కోరారు. శనివారం బస్టాండ్ ప్రాంగణంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బస్సు ఎక్కే ముందు, దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బైక్, కారు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వేగంగా వాహనాలు నడుపవద్దని, ప్రమాదాలు నివారించేందుకు సహకరించాలన్నారు. హై వేలపై ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఓవర్‌టేక్ చేయడం మంచిది కాదన్నారు. రీజినల్‌మేనేజర్ సలోమన్ మాట్లాడుతూ... బస్టాండ్‌లో ట్రాఫిక్ నిబంధనల వీడియోలు ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ ప్రాధాన్యమిస్తోందన్నారు. డీఎం ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్‌కుమార్, స్టేషన్ మేనేజర్ ఏఆర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 2008 డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈవో

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో శనివారం 2008 డీఎస్సీ అభ్యర్థులకు సజావుగా కౌన్సిలింగ్ నిర్వహించినట్లు డీఈవో రామారావు తెలిపారు. విద్యాశాఖ సంచాలకుల ఆదేశం మేరకు సర్టిఫికెట్లు పరిశీలించామన్నారు. నిర్మల్ జిల్లాకు 20 మంది అభ్యర్థులు ఎంపిక కాగా 17 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశం మేరకు ఖాళీలను కౌన్సిలింగ్ ద్వారా నియామక ఉత్తర్వులు అందజేశా మన్నారు. సూపరింటెండెంట్ వెంకట రమణ, శ్రావణి, సమన్వయ కర్తలు రాజేశ్వర్, ప్రవీణ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. కాంటాక్ట్ పద్ధతిన ఏడాది పాటు పని చేస్తారన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల విధుల బహిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమ అరెస్టులను నిరసిస్తూ శనివారం నిర్మల్ జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులను బహిష్కరించారు. మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగుల అంతిమ సంస్కారాలకు హాజరయ్యేందుకు వెళ్లిన సమగ్రశిక్ష ఉద్యోగులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, రత్నం ఆరోపించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్టు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


మాచాపూర్ శివాలయంలోని శివలింగం

మాచాపూర్‌లో వైభవంగా ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

● నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, అన్నదాన ప్రసాద వితరణ
● 28 ఫీట్ల ఏకశిలా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచాపూర్ గ్రామంలో శివ పంచాయతన, ధ్వజ, యంత్ర, శిఖర, ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానికంగా నిర్మించిన నూతన శివాలయంలో శివలింగంతో పాటు పార్వతి, సూర్యుడు, గణపతి, నాగదేవత పలు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం ముందు 28 ఫీట్ల ఏకశిలా ధ్వజ స్తంభాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం గత బుధవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు రోజులుగా నిత్యాన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ మహోత్సవానికి గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మాచాపూర్ శివాలయం ముందు ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

కడెంలో ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

కడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించారు. తపస్వి రామారావు మహారాజ్ ప్రతిమకు పూలమాలలు వేసి, సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు రాజేందర్ హపావత్, కడెం తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ లక్ష్మణ్, సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు మాణిక్ రావు, హరిలాల్, రాజు, మోహన్, రవి, రామారావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి


అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు


అంబలి కుండ ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం


అగ్నిగుండం వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు

ముగిసిన మల్లన్న జాతర

● అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు
● ముగింపు సందర్భంగా గాజులు కొనుగోలు

ముథోల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుడి జాతర ఈ నెల 11న ప్రారంభమైన శనివారం నాటికి అంబలి కుండ ఇంటికి తేవడంతో ముగిసింది. ముగింపు సందర్భంగా భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. అనంతరం మహిళా భక్తులు జాతర ముగింపు సందర్భంగా గాజులు కొనుగోలు చేశారు. మల్లన్న జాతరలో గాజులు కొనుగోలు చేయడం ద్వారా ఇంటి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్మకం. అంతేకాకుండా సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మొక్కిన మొక్కులు నెరవేరాలని కొందరు కోరిన కోరికలు తీరాయని మరికొందరు భక్తులు దగదగ మండే నిప్పు రవ్వల పైనుంచి సుమారు 900ల మందికి పైగా భక్తులు అగ్నిగుండంలో నుంచి నడిచారు. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి సంఘటనలు జరుగకుండా సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్, అశోక్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

● కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం
● ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


తలమడుగు వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

తలమడుగు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అతిపురాతనమైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంబాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అదేవిధంగా వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలన్నారు. తలమడుగులోని వేంకటేశ్వర ఆలయంలో దాదాపు రూ.3 లక్షల వ్యయంతో ధ్వజస్తంబాన్ని నిర్మించిన వ్యాపారవేత్త కాటిపెల్లి వసంత్‌రెడ్డి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం బ్రహ్మోత్సవాల సం దర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పూలాజి బాబా ధ్యాన మందిరంలో పూజలు నిర్వహించి ధ్యాన మందిర అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఇందులో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పిడుగు సంజీవ్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మొట్టె కిరణ్ కుమార్, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాటిపెల్లి సునితరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, జాదవ్ వెంకటేశ్, ఆసంరవి, మేకల రవికాంత్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు కరుణాకర్‌రెడ్డి, పొచ్చన్న, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు



బంగారం దొరికితేనే ఆదాయం

ఫోటో న్యూస్

బంగారం దొరికితే ఎవరైనా లక్షాధికారి కావొచ్చు కానీ వీరికి మాత్రం అది దొరికితేనే ఆదాయం. పట్టణంలోని బంగారు దుకాణాల సముదాయాల వద్ద వీరు ప్రతీ రోజు చిన్నపాటి బంగారం, వెండి ముక్కలు దొరుకుతాయన్న ఆశతో విశ్వ ప్రయత్నాలు చేస్తుంటారు. వేకువ జామునే దుకాణాల ముందర శుభ్రం చేస్తారు. మురికి కాలువల నీటిని సైతం వడ గట్టి బంగారం, వెండి కోసం తీక్షణంగా పరిశీలిస్తారు. గతంలో ఒక్కడే నగల తయారీ జరిగే సమయంలో చిన్న మొత్తంలో బంగారం దొరికేదని, ప్రస్తుతం రెడీమేడ్ నగల హవా నడుస్తుండడంతో ఆదాయం భారీగా తగ్గిందని వాపోతున్నారు. తమ తాత, ముత్తాతల నుంచి వస్తున్న ఈ వృత్తినే కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నామని, గతంలో 12 వరకు కుటుంబాలు ఉండగా ఇప్పుడు మూడు కుటుంబాలకు పరిమితం అయ్యాయని చెబుతున్నారు.


దుకాణాల వద్ద బంగారం, వెండి ముక్కలు దొరుకుతాయని వెతుకుతున్న దృశ్యం





(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)





ఉద్యమకారుల చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయం

● ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్


పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్, విఠల్‌రెడ్డి

భైంసా, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాటు పడిన ముథోల్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఆనంద్‌రావ్ పాటిల్‌లు పేర్కొన్నారు. శనివారం భైంసాలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో తెలంగాణ తెలుగు కళా నిలయం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర, బలరామ శతకం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అమరవీరుల త్యాగఫలితంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. రాచరికపు పాలన, వలస పాలకుల పరిపాలనతో అణగారిన తెలంగాణను విముక్తి చేయడానికి తెలంగాణ బిడ్డలు త్యాగాలతో కూడిన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం మూలంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. ఇలాంటి ఉద్యమకారుల పోరాట పటిమను, త్యాగాలను, అంకిత భావాలను భావి తరాలకు స్ఫూర్తిని కలిగించేలా చరిత్ర రూపంలో పుస్తకాన్ని రూపొందించడం గర్వకారణమన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డా. ముష్కం రామకృష్ణాగౌడ్ నేతృత్వంలో తెలంగాణ తెలుగు కళా నిలయం ప్రతినిధులు జాదవ్ పుండలిక్‌రావు, సోమ జనార్ధన్ రెడ్డి, కదారి దశరథ్, పిసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజులు సమష్టి కృషితో సమన్వయం చేసుకొని తెలంగాణ ఉద్యమకారుల పేరిట పుస్తకాన్ని తీసుకరావడం అన్ని విధాలుగా అభినందనీయమన్నారు. పుస్తక రచయితలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇందులో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.దామోదర్‌రెడ్డి, జేఏసీ ప్రతినిధులు రవి పాండే, జాదవ్ రాజేష్ బాబు, గిరిధారి జంగ్మే, గౌతం పింగ్లే, సోలంకి భీంరావ్ పటేల్, భోస్లే పండిత్‌రావు, పుప్పాల పీరాజీ, చాకేటి లస్మన్నతో పాటు ముథోల్ నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువజన సంఘాల శ్రేణులు పాల్గొన్నారు.









ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 కనిష్ఠం 11.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 16 ఫిబ్రవరి 2025







● పట్టణంలో గిరాకీ లేక బోసిపోయిన చికెన్ సెంటర్

బర్డ్ ఫ్లూ భయం

- చికెన్ ముక్క అంటేనే జంకుతున్న జనం
- చేపలు, మటన్‌కు భారీగా పెరిగిన డిమాండ్
- మృత్యువాత పడుతున్న కోళ్లు.. మూతపడిన చికెన్ సెంటర్లు
- తగ్గిన బిర్యానీ అమ్మకాలు.. ఆందోళనలో వ్యాపారులు
- ఆదివారం రోజు వంటలపై అయోమయంలో మహిళలు



● విక్రయాలు లేక వెలవెలబోతున్న చికెన్ సెంటర్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముక్క లేనిదే ముద్ద దిగని నాన్‌వెజ్ భోజన ప్రియులను బర్డ్‌ఫ్లూ భయం వెంటాడుతోంది. ఇప్పటికే వైరస్ వ్యాప్తిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్ర స్థాయిలో పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని రోజుల పాటు చికెన్ ముక్క తినక పోవడమే మంచిదని భావిస్తున్న జనం కోడికూరకు దూరంగా ఉంటున్నారు. మిగతా రోజుల్లో ఎలా ఉన్న ఆదివారం వచ్చిందంటే చాలు ముక్కలేనిదే ముద్దదిగడం కష్టమంటున్నారు. అయితే ఈ ఆదివారం రోజు వంటలపై అంతటా అయోమయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు వైరస్ ఆనవాళ్లు వెలుగులోకి రాకపోయిన బర్డ్ ఫ్లూ పై సోషల్ మీడియాలో వివిధ రకాల ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా జిల్లా కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్‌లో 25 కోళ్లు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పౌల్ట్రీ కోళ్లను జిల్లాకు సరఫరా చేస్తున్నారు. గిరాకీ లేక పోవడంతో ఆర్డర్లు కూడా ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. వైరస్‌కు అడ్డుకట్ట వేసి ప్రజల్లో చికెన్ పై ఉన్న అనుమానాలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పౌల్ట్రీ రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

మటన్ ధరలు పై పైకి..

బర్డ్ ఫ్లై వైరస్ భయంతో చికెన్ తినడం మానేసిన జనం మటన్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మటన్ ధరలు మరింతగా మండిపోతున్నాయి. ఇది వరకే కిలో మటన్ రూ.700 నుంచి రూ.800 వరకు ఉండేది. ప్రస్తుతం ఒకే సారి డిమాండ్ పెరిగి పోవడంతో రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు మటన్ జోలికి వెళ్లకుండా పప్పు నీళ్ల చారుతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే చేపలకు డిమాండ్ ఎక్కువగానే కనిపిస్తుంది. ఇన్నాళ్లు కిలో రూ.200 ఉన్న చేపలు రూ.250 నుంచి రూ.300 వరకు ధర పలుకుతోంది. ఎక్కువ మంది చేపలను తినేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితులతో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయి. ముఖ్యంగా ఆదివారం రోజు మటన్ చేపలకు భారీగా డిమాండ్ కనిపిస్తోంది.

నిలిచిపోయిన కోళ్ల సరఫరా..

గత నాలుగైదు రోజులుగా జిల్లాకు పౌల్ట్రీ కోళ్ల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో జిల్లా కేంద్రంలోని పలు చికెన్ సెంటర్లు మూతబడ్డాయి. చివరి సారిగా గత మంగళవారం జిల్లాకు కోళ్లను సరఫరా చేశారు. ఆతర్వాత సరఫరా నిలిచిపోవడంతో స్టాక్ లేదన్న కారణంగా వ్యాపారులు చికెన్ సెంటర్లను తెరవడం లేదు. జిల్లా కేంద్రంలో సుమారుగా 300లకు పైగా చికెన్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 10లోపు చికెన్ సెంటర్లు మాత్రమే తెరిచి ఉంటున్నాయి. అయిన ఆశించిన స్థాయిలో గిరాకీలు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే కోళ్లు మృత్యువాత పడినట్లు ప్రచారం జరగడంతో వ్యాపారులు కూడా షాపులను తెరిచేందుకు ముందుకు రావడం లేదు. ప్రజల్లో ఉన్న అనుమానాలతో బిజినెస్ దెబ్బతింటుందని భయపడుతున్నారు. ఎండల తీవ్రతకు కూడా కోళ్లు చనిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

పడిపోయిన గిరాకీలు..

ప్రధాన హోటళ్లతో పాటు ఫాస్ట్‌ఫుడ్, గ్రీల్స్, బకెట్ చికెన్ సెంటర్లలో గిరాకీలు పూర్తిగా పడిపోయాయి. గతంలో క్వింటాల్ చికెన్ అమ్మకాలు జరిగిన షాపుల్లో ప్రస్తుతం 20, 30 కేజీలు కూడా అమ్మడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో షాపు నిర్వాహణ భారంగా మారి పెట్టుబడులు చేతికి రావడం లేదని చెబుతున్నారు. గతంలో చికెన్ బిర్యానికి భలే గిరాకీ ఉండేది. ముఖ్యంగా ఆదివారం రోజున బిర్యానీకి ఎక్కువ ఆర్డర్లు వచ్చేవి. కానీ ప్రస్తుతం డిమాండ్ లేకపోవడంతో అసలు ఆర్డర్లే రావడం లేదని హోటల్ యజమానులు వాపోతున్నారు. దీంతో మటన్ బిర్యానీని అందుబాటులో ఉంచుతున్న అనుకున్నంత గిరాకీ కావడం లేదంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదారు ఆర్డర్లు కూడా రావడం లేదంటున్నారు. ఇవే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు ఉంటే హోటల్స్‌ను పూర్తిగా మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. గిరాకీలు లేక పోవడంతో పౌల్ట్రీ రైతులకు కూడా గడ్డు పరిస్థితులే ఎదురవుతున్నాయి. అమ్మకాలు పడిపోవడంతో కోళ్ల పెంపకంపై ప్రభావం పడే అవకాశం లేక పోలేదంటున్నారు.

గిరాకీలు పూర్తిగా పడిపోయాయి..



: ఎం.నాగేందర్ (బిర్యానీ హోటల్ వ్యాపారి, ఆదిలాబాద్)

బర్డ్‌ఫ్లూ భయంతో గిరాకీలు పూర్తిగా పడిపోయాయి. దీంతో కస్టమర్లు ఎవరూ రావడం లేదు. గతంలో రోజుకు 50 నుంచి 100 వరకు చికెన్ బిర్యానీలను అమ్మేది. ప్రస్తుతం పదిలోపే బిర్యానీలు అమ్ముడుపోతున్నాయి. అది కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు గిరాకీ అవుతుంది. కూలీల ఖర్చులు కూడా రావడంలేదు. హోటల్ నిర్వహించడం ఎలాగో అర్థం కావడం లేదు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

'ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు దిశగా పనిచేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నార్నూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ సమిష్టిగా పనిచేస్తే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు మనదే అంటూ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం నార్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకువెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పార్టీశ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, వారి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బి.గజానంద్ నాయక్, లోకండే దేవరావ్, షేక్ నసీర్, ఇంద్రవెల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ స్వయం మారుతి, కరీంఖాన్, మహిళా నాయకురాలు ప్రణీత పాల్గొన్నారు.

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి



నేరడిగొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజార సంఘ్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం బంజారాల సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి బోగ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలందరికి సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. బుగ్గారాం గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని కుంటాల ఎక్స్‌రోడ్డు వద్ద విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. సేవాలాల్ మహరాజ్ ప్రతిమతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆడ, మగ, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆడే వసంత్‌రావ్, వీడీసీ చైర్మన్ రవీంద ర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీసర్పంచ్‌లు మహేందర్, కరణ్, నాయకులు కృష్ణ నాయక్, జగన్, జి.అంబారావ్, ఆర్.భీంరావ్, భామ్రు, బీబీ చంద్, మంగులాల్, మహేష్, కాశీరామ్, బాబులాల్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నేరడిగొండ మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజక వర్గంలో గల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నియోజక వర్గంలో గల బీఆర్ఎస్ నాయకులు ప్రతి ఒక్కరు మూడు మొక్కలు నాటాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న నిర్వహించే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి శనివారం ఆదిలాబాద్ జడ్పీ మీటింగ్ హాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు.



గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల తనిఖీలో భాగంగా శనివారం శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట సూపరిండెంట్ పంచపూల, సిబ్బంది దేవరాజ్ ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

● తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడంగణేష్

తలమడుగు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో రాణించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కాని ఇప్పటికి మహిళలపై ఆత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. మహిళలను మేల్కొల్పేందుకే తుడందెబ్బ ఆధ్వర్యంలో మార్చి 8న జిల్లా కేంద్రంలోని మావల గ్రామ పంచాయతీ పరిధిలో గల కొమురంభీం కాలనీలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో తుడందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, డివిజన్ అధ్యక్షులు కుమ్రజ్ఞానేశ్వర్, మండల అధ్యక్షులు జంగాలపొచ్చన్న, మండల ప్రధాన కార్యదర్శి భుజంగ్‌రావు, దాంజీ పటేల్, మాజీ ఎంపీపీ సిడాంరాము, పెందూరురఘునాథ్, గోవింద్‌రావు, లక్ష్మణ్, గ్రామపటేల్, ప్రభాకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయ వంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధానన్యాయాధికారి ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రానున్న లోక్ ఆదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు ప్రమీల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏఎస్పీ సురేందర్ పాల్గొన్నారు.

ఏడీబీ కోర్టులో డిజిటలైజేషన్ కేంద్రం ప్రారంభం

కోర్టులోని కేసుల రికార్డులను భద్రంగా ఉంచడానికి సుప్రీం ఆదేశాల మేరకు డిజిటలైజేషన్ చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. న్యాయ మూర్తులు ప్రమీలజైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయాధికారి ప్రభాకర్ రావు

రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన



ఉట్నూర్ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్

ఉట్నూర్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్టీసీడిపో సూపరింటెండెంట్ బాధవత్ శంకుతల రాజన్న మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సుడ్రైవర్లు, ఇతర వాహనాలను నడిపేవారు మందు తాగి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్‌పై ప్రయాణించకూడదని, బైక్‌పై వెళ్లేటప్పుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేఫ్టీ వార్డెన్ జి.విష్ణు, ఆర్టీసీ సిబ్బంది పోశెట్టి, వంశీ, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఆదివాసీలు వ్యతిరేకం కాదు : తుడుందెబ్బ



సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇచ్చోడ, ఫిబ్రవరి, 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనేతరులకు ఆదివాసీలు వ్యతిరేకం కాదని ఆదివాసీల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు గిరిజనేతరుల ఆస్తుల జోలికి వెళ్లమని తుడుందెబ్బ నాయకులు అన్నారు. శనివారం ఇచ్చోడ మండలంలోని మేడిగూడలో గొండ్వాన పంచాయితీ రాయిసెంటర్ సార్‌మెడి అధ్యక్షతన 33 గ్రామాల పటేల్‌లు, దేవరి, మహాజన్‌ల సమక్షంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు ఆర్‌టీఐ ఆక్ట్ పేరుతో వ్యక్తిగత అవసరాల కోసం ఇచ్చోడలో ఇంటి నిర్మాణాలకు నోటీసులు ఇవ్వడం పట్ల మేడిగూడ రాయిసెంటర్ సభ్యులు వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే రాయిసెంటర్‌లో ఫిర్యాదు చేయాలని గిరిజనేతరులకు సూచించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కొడప నగేష్, మెస్రం శంభు, జ్యోతిరాం, తులసీరా, భీంరావ్, జలైజాకు, ఆశోక్, గంగారా, నాగోరావ్, లక్ష్మణ్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన కంది పంట దిగుబడి

● ఆందోళనలో రైతులు

తాంసి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కంది రైతులను ఆ పంట సైతం ఆదుకోలేక పోయింది. కంది పంటపైనే రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కనీసం ఎకరానికి నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా కష్టంగా వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దిగుబడి ఇలా ఉంటే మార్కెట్లో గిట్టుబాటు ధర సైతం రావడం లేదని అంటున్నారు. క్వింటాలుకు రూ.7వేలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కంది రైతులు కోరుతున్నారు. కంది పంట చేతికి వచ్చి నెలరోజులు కావస్తున్నా కొనుగోలు చేయకపోవడం పట్ల తాంసి మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు కందులు కొనుగోలు చేయడం లేదంటూ శనివారం సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు చేయాలని, లేని పక్షంలో రోడ్లపై బైఠాయిస్తామని పేర్కొన్నారు. కందుల కొనుగోలు విషయంలో ఎందుకు తాంసి సహకార సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. వెంటనే కందులు కొనుగోలు చేసి తమకు సహకరించాలని కోరుతున్నారు. ప్రైవేట్ దళారులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి తాంసిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని తాంసి, భీంపూర్, తలమడుగు మండల రైతులు కోరుతున్నారు.